నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జనవరి 31, 2025 | www.navatelangana.com

స్వాతంత్ర్య పోరాటంలో త్యాగధనుల సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-నస్పూర్

దేశ స్వాతంత్ర్య పోరాటంలో త్యాగధనుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకుంటూ 2నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యం, అహింసా మార్గంలో అలుపెరుగని పోరాటం చేసిన మహాత్మాగాంధీ దేశానికి అందించిన సేవలు సదా స్మరణీయమని, జాతిపితగా గౌరవించుకుంటున్నామని అన్నారు. మహనీయులు చూపిన మార్గాలను ఆచరిస్తూ దేశాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జైపూర్ : మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఎంపీఓ శ్రీపతిబాపురావుతో కలిసి ఎంపీడీఓ సత్యనారాయణ, సిబ్బంది మహాత్మాగాంధీ చిత్రపటం ముందు మౌనం పాటించారు. స్వాతంత్ర్యం సాధించడం కోసం ఆయన చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

నవతెలంగాణ-జైపూర్



మండల స్థాయి నుండి జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సంజనను ఎస్సై శ్రీధర్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారినికి అవసరమైన క్రీడా సామాగ్రి సమకూర్చడానికి హామీ ఇచ్చారు. అండర్-17 జట్టులో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సంజన క్రికెట్‌లో మరింత ప్రావీణ్యత సాధించి భవిష్యత్తులో జాతీయ జట్టు క్రీడాకారినిగా ఎదగాలని పేర్కొన్నారు.

సమస్యలు యథాతథం..!

- ఇంకా తీరని పోడు భూముల సమస్య
- పట్టాల్లో దొర్లిన తప్పులతో తీవ్ర తిప్పలు
- అటవీ అనుమతులు లేక ఆగిన అభివృద్ధి పనులు
- నేడు కేస్లాపూర్‌లో గిరిజన దర్బార్

ప్రభుత్వాలు మారుతున్నా..పాలకులు మారుతున్నా గిరిజనుల బతుకుల్లో మాత్రం మార్పులు రావడం లేదు. ఏండ్లుగా అరకొర సౌకర్యాల మధ్యనే జీవనం సాగించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెబుతున్నా అవి పూర్తి స్థాయిలో అర్హులకు చేరకపోవడం.. ఇంకా అనేక పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చామని చెబుతున్నా..వాటిలో అనేక తప్పులు దొర్లడంతో తీవ్ర తిప్పలకు గురిచేస్తోంది. మరోపక్క చనిపోయిన వారి వారసులకు విరాసత్ చేయడంలో రెవెన్యూ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తోందని ఆదివాసీ గిరిజనులు వాపోతున్నారు. మరోపక్క గిరివికాసం పేరిట భూముల్లో బోర్లు తవ్వి..కరెంటు సరఫరా చేయాలని భావించినా నిధుల కొరత, అధికారుల జాప్యం మూలంగా ఈ పథకం ఆగుతూ సాగుతోంది.నాగోబా జాతరను పురస్కరించుకొని శుక్రవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ప్రభుత్వం గిరిజన దర్బార్ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కథనం..



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాను అడవుల జిల్లానే కాదు..అధికంగా ఆదివాసీ గిరిజనులు నివసించే జిల్లాగానూ పిలుస్తారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నా పూర్తిస్థాయిలో వారి దరిచేరడం లేదు. ఫలితంగా ఇప్పటికీ వారి బతుకుల్లో మార్పులు రావడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలోని అనేక పల్లెలు కనీస మౌళిక వసతులకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా గత ప్రభుత్వం గిరిజనుల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 37,401మందికి 1.03లక్షల ఎకరాలను పంపిణీ చేసింది. కానీ పట్టాల్లో తప్పులు దొర్లడం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు ఎకరాలు కలిగిన ఒక ఎకరమని..కొందరికి కేవలం గుంటల్లో నమోదు చేయడంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుభరోసాతో పాటు బ్యాంకు రుణాలు సైతం పొందలేకపోతున్నారు. పట్టాలు అందించినా తక్కువ భూమి నమోదు చేయడంతో ఎలాంటి ప్రయోజనం నెరవేరడం లేదు. మరోపక్క చనిపోయిన వారసులకు భూమి విరాసత్ చేయడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. విరాసత్ కోసం అనేక మంది గిరిజనులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. జిల్లాలో సుమారు 5వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. మరోపక్క అటవీ అనుమతులు లభించక పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు, కొన్ని వంతెనల పనులు కూడా నిలిచిపోయాయి. ఈ అనుమతుల ప్రక్రియలో జాప్యం జరగడంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రోడ్లు లేక ఇబ్బందులు..!

గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ఐటీడీఏ వంటి ప్రత్యేక వ్యవస్థ ఉన్నా.. ప్రభుత్వాల అలసత్వం కారణంగా గిరిజనులకు న్యాయం చేయలేని పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా గిరివికాసం కింద పంట పొలాలను సస్యశ్యామలం చేసేందుకు బోర్లు తవ్వి..కరెంటు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ ఇంకా అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోపక్క రోడ్ల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఇప్పటికి వివిధ పల్లెలకు వెళ్లేందుకు రోడ్లు లేకపోవడంతో గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు సకాలంలో ఆస్పత్రులకు వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా కొన్ని రహదారులకు అటవీ అనుమతులు లభించకపోవడంతో ఆయా పనులు నిలిచిపోయాయి. మరోపక్క మారుమూల పల్లెలకు మిషన్ భగీరథ వంటి పథకం వచ్చినా వేసవి వచ్చిందంటే తాగునీటి గోస తప్పడం లేదు. కొండపైన గ్రామాలకు సక్రమంగా నీటి సరఫరా కాకపోవడం.. కొన్ని చోట్ల పైప్‌లైన్లు పగిలిపోవడం.. విద్యుత్తు సమస్యల కారణంగా తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది.ఫలితంగా గిరిజనులు ఏటా తాగునీటికి వాగులు, బావుల మీదనే ఆధారపడుతున్నారు. మరోపక్క పీవీటీజీల కోసం ప్రభుత్వం వెయ్యి ఇండ్లను మంజూరుచేసింది. కానీ నిధులు సకాలంలో విడుదల కావడంలో జాప్యం జరుగుతుండటంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం 620ఇండ్లు మాత్రమే పూర్తయినట్లు తెలుస్తోంది. మరోపక్క వసతిగృహాల్లో మెనూ అమలులోనూ అలసత్వం కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల మెస్ ఛార్జీలు పెంచినప్పటికీ ఆశించిన ఫలితం రావడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం కూడా స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

దరఖాస్తులు పరిష్కరించాలి : గోడం గణేష్, తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్

దర్బార్‌లో ప్రతి సంవత్సరం గిరిజనుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. కానీ చాలా వాటికి పరిష్కారం లభించడం లేదు. కనీసం ఎన్ని పరిష్కరించేమో కూడా చెప్పడం లేదు.. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపించాలి.

ఎన్నికల కోడ్ సాకుతో రైతు భరోసా నిలిపేస్తే సహించం

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎలక్షన్ కోడ్ సాకుతో రైతు భరోసా నిలిపివేస్తే సహించబోమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. సొంత స్థలం లేని నిరుపేదలకు ఇళ్లను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. హామీలతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో ఇల్లు లేని పేదల నుండి లక్షా90వేలు, నియోజకవర్గం నుండి సుమారు 70వేలకు పైగా దరఖాస్తులు అందాయని తెలిపారు. కానీ నియోజకవర్గానికి కేవలం 3500 ఇల్లు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. అర్హులను ఎలా గుర్తిస్తారో, దానికి సంబంధించిన పూర్తి ప్రణాళికను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రేషన్ కార్డు జారీపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మెడిసమ్మే రాజు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పోటీపడుతున్న క్రీడాకారులు

- కొనసాగుతున్న ఎస్టీపీపీ క్రికెట్ లీగ్



నవతెలంగాణ-జైపూర్

విజయం సాధించడమే లక్ష్యంగా క్రికెట్ క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ క్రికెట్-2025 లీగ్ పోటీల్లో భాగంగా గురువారం ఫస్టాఫ్‌లో ఎస్టీపీపీ స్టార్ ఛాంపియన్ వర్సెస్ పీఎంపీఎల్ పవర్ స్మాషర్స్ జట్లు పోటీ పడ్డాయి. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పవర్ స్మాషర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 69 పరుగులు సాధించింది. స్టార్ ఛాంపియన్ జట్టుకు చెందిన బౌలర్ 3ఓవర్లలో నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఆ తదుపరి బ్యాటింగ్ చేపట్టిన స్టార్ ఛాంపియన్స్ జట్టు 9.4 ఓవర్లలో 70 పరుగులతో విజయం సాధించింది. స్టార్ ఛాంపియన్ క్రీడాకారుడు ప్రశాంత్ 29 పరుగులు సాధించి జట్టును గెలిపించాడు. ఆయనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును డీజీఎం సంతోష్ కుమార్ అందజేశారు. సెకండాఫ్‌లో పీఈఎస్ వర్సెస్ కర్మ వారియర్స్ జట్లు తలపడగా నిర్ణీత 12 ఓవర్లలో రెండు జట్లు 85 పరుగులు సాధించగా మ్యాచ్ సమయం అవ్వడంతో సూపర్ ఓవర్ అవసరమైంది. మొదట బ్యాటింగ్ చేసిన పీఈఎస్ జట్టు 8 వికెట్లు నష్టపోయి 85 పపరుగులు సాధించింది. ఈ జట్టు క్రీడాకారుడు షహజాద్ 22 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్మ వారియర్స్ జట్టు ఆరు వికెట్లు నష్టపోయి 85 సాధించింది. ఫలితంగా సూపర్ ఓవర్ ఆడాల్సి రావడంతో పీఈఎస్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. సెకండాఫ్‌లో పీఈఎస్ వర్సెస్ కర్మ వారియర్స్ జట్ల మధ్య పోటీ ఉత్కంఠభరితంగా కొనసాగింది.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

- డీఎల్‌పీఓ ధర్మారాణి



నవతెలంగాణ-జైపూర్

గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి సూచించారు. గురువారం ఇందారం గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో వంద శాతం పన్ను వసూళ్లు చేసి ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ సాధారణ నిధికి జమ చేయాలని తెలిపారు. అనంతరం వార్డుల్లో పర్యటించిన ఆమె తడిపొడి చెత్త వేరువేరుగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ కూడా కన్పించకూడదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడ కూడా ఫెక్సీలు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

పాలనలో ప్రత్యేకం

- పాలకవర్గ గడువు ముగిసిన నాలుగు రోజులకే కబ్జాలపై నజర్
- కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కబ్జాల కూల్చివేత షురూ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ పాలకవర్గ గడువు ఈ నెల 26తో ముగిసిన విషయం తెల్సిందే. అప్పటి వరకు పట్టణంలో కబ్జాలకు గురైన స్థలాలపై మున్సిపల్ పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా మున్సిపల్ స్థలాలే అన్యాక్రాంతమవుతున్నా వాటిని పట్టించుకోకపోగా, కొంతమంది కౌన్సిలర్లే వాటిని అక్రమార్కులకు అంటగట్టి పైసలు దండుకునే ప్రయత్నాలు చేశారు. ఇది పలు పత్రికలలో వచ్చినా అధికారయంత్రాంగం చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు కౌన్సిల్ గడువు ముగిసి, ప్రత్యేకాధికారి పాలన రావడం, ఆ అధికారి ఆదేశాలతో పట్టణంలో కబ్జాలకు గురైన స్థలాలను పరిశీలించడం, వాటిని కూల్చివేయడం లాంటి చర్యలకు అధికారులు పూనుకుంటున్నారు.

హోంలెస్ షెల్టర్ స్థలంలో అక్రమ కట్టడాల కూల్చివేత

పట్టణంలోని నిరాశ్రయులు రాత్రి సమయంలో తలదాచుకునేందుకు ప్రభుత్వం హోంలెస్ షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రెవెన్యూ శాఖ నుండి సర్వే నెం.143లోని సుమారు 999 చదరపు గజాల స్థలాన్ని తీసుకుంది. ఈ స్థలంలో హోంలెస్ షెల్టర్ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ సమయంలోనే అక్రమార్కుల కన్ను కోట్ల విలువ చేసే ఈ స్థలంపై పడింది. ఇంకేముంది తమకు అనుకూలంగా ఉన్న కొంతమంది పాలకవర్గ సభ్యులతో చేతులు కలిపి కబ్జాకు పాల్పడ్డారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి, అందులో ఒక షెడ్డును నిర్మించారు. ఇన్నాళ్లు ఈ అక్రమ కట్టడాన్ని తొలగించడానికి పాలకవర్గ సభ్యులే అడ్డుపడ్డారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. గురువారం ఈ ప్రహరీతో పాటు అందులోని కట్టడాన్ని మున్సిపల్ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సమక్షంలో పోలీసు బందోబస్తు మధ్య ఈ కట్టడాన్ని కూల్చివేశారు. పాలకవర్గ గడువు ముగిసిన నాలుగు రోజులకే ఈ కట్టడాన్ని తొలగించడం బట్టి చూస్తే ఇన్నాళ్లు ఈ కబ్జా వెనుక పాలకవర్గ సభ్యుల హస్తం ఉందనే ఆరోపణలకు బలం చేకూరింది.



నిన్నటి వరకు హోంలెస్ షెల్టర్ స్థలం ఇది

మరో రెండు షెడ్ల కూల్చివేత

కబ్జాకు గురైన హోంలెస్ షెల్టర్‌కు సమీపంలోనే రోడ్డు మీద నిర్మించిన రేకుల షెడ్డును కూడా మున్సిపల్ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఒక వ్యక్తి తన ఇంటి నిర్మాణం ముందు బాగంలో ఈ రేకుల షెడ్డు వేయగా దానిని కూల్చివేశారు. అదేవిధంగా స్థానిక ఎల్లాగౌడ్‌తోటలో పార్క్ ముందు భాగంలో కూడా అక్రమంగా వేసిన తాత్కాలిక షెడ్డును అధికారులు గురువారం తొలగించారు. ఈ తాత్కాలిక షెడ్డు ఇన్నాళ్ల కౌన్సిల్‌లో ఉన్న ఒక సభ్యుడిదేననే ఆరోపణలు ఉన్నాయి.

ఆక్రమణలను తొలగిస్తున్నాం : అంజయ్య, మున్సిపల్ కమిషనర్

పట్టణంలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. హోంలెస్ షెల్టర్ నిర్మాణ స్థలంలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా, దీనిపై విచారణ చేపట్టాం. ఇది మున్సిపల్ స్థలమని తేలడంతో ఇందులో నిర్మించిన అక్రమ కట్టడాన్ని గురువారం తొలగించాం.



పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేస్తున్న అక్రమ కట్టడం



హోంలెస్ షెల్టర్ సమీపంలో కూల్చివేసిన రేకుల షెడ్డు

అధికారులు ఒత్తిడితోనే ఏఈఈ ఆత్మహత్య

- నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన
- న్యాయం చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికారులు ఒత్తిడి తట్టుకోలేక నిజామాబాద్ జిల్లాకు చెందిన యువ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయిచరణ్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలంగాణ గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం ఎదుట తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సాయిచరణ్ ఆత్మకు శాంతి చేకురాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. వీరి నిరసనకు టీజీఓ సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా టీజీఓ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ 10 సంవత్సరాల క్రితం పనులకు సంబంధించి వర్క్ కంప్లీషన్ తయారు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఐదు నెలల క్రితం వచ్చిన ఏఈఈలకు వాటి గురించి ఏం తెలుస్తుందన్నారు. గతంలో ఉన్న అధికారులు పూర్తి చేసిన కూడా అధికారులు ఏఈఈలపై ఒత్తిడి పెంచుతున్నారన్నారు. దాని కారణంగా నిజామాబాద్ జిల్లాలో ఏఈఈ సాయిచరణ్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం సెంట్రల్ టీజీఓ కమిటీ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. న్యాయం జరిగేంత వరకు తమ సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఏఈఈలు పాల్గొన్నారు.

పేదింటి పెండ్లికి ఆర్థిక సాయం



జైపూర్ : పేదింటిలో జరుగుతున్న పెళ్లికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఫయాజొద్దీన్ ఆర్థిక తోడ్పాటు అందించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన చేగొండ చిన్న కొమురయ్య కూతురు పెళ్లి నిశ్చయమైనట్లు తెలుసుకున్న ఫయాజొద్దీన్ స్థానికులతో కలిసి గురువారం కొమురయ్య కుటుంబ సభ్యులకు రూ.5వేలు నగదు అందజేశాడు. ఇందారం గ్రామానికి చెందిన చేగొండ దేవక్క-కొమురయ్య దంపతులకు ముగ్గురు కూతుర్లు కాగా చిన్న కూతురు వివాహానికి తనవంతుగా ఆర్థిక సాయం అందినట్లు ఫయాజొద్దీన్ తెలిపాడు. పేద కుటుంబాల వారికి అండగా ఉండాలన్న తలంపుతో కుల మతాలకు అతీతంగా ఆర్థిక సాయం చేస్తున్నట్టు తెలిపారు.

స్వచ్ఛందంగా రక్తదానం అభినందనీయం : కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

రహదారి ప్రమాదాలు, తలసేమియా, గర్భిణులు, అత్యవసర సమయాలలో రక్తం అవసరం ఉన్న వారి కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టి కన్వెన్షన్ హాల్లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం - కంటి పరీక్షల శిబిరానికి డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు, అత్యవసర సమయాలలో రక్తం కావలసిన వారి సంక్షేమం కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని తెలిపారు. అన్ని దానాల్లో కన్నా రక్తదానం చాలా గొప్పదని, ఒకరి ప్రాణాలు కాపాడటం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. 40 సంవత్సరాలు వయస్సు దాటిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల బాధ్యత అని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు, ఇతర వాహనాల చోదకులు సీటబ బెల్ట్ తప్పనిసరిగా పాటించాలని, కూడళ్ల వద్ద సిగ్నల్స్‌ను తప్పనిసరిగా అనుసరించాలని, నియంత్రిత వేగంతో వాహనాన్ని నడపాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం తాగి వాహనం నడుపకూడదని, వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటుందని, వేగ నిరోధకాలతో పాటు వాహనదారులకు అర్థమయ్యే విధంగా ప్రమాద ప్రాంతాలు, మూలమలుపు ఇతర అన్ని ప్రాంతాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహన తనిఖీలలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికినట్లయితే జరిమానా విధించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని వారికి, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతా నియమ, నిబంధనలను వివరిస్తూ ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రక్తదాన శిబిరంలో 53 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ రంజిత్, ఎఎంవిఐ ఖాసీం, సూర్యతేజ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు చందూరి మహేందర్, సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ఎఫెక్ట్

జైపూర్ : ఎమ్మెల్సీ ఎన్నికల ఎఫెక్ట్ మొదలైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున మండల కేంద్రంలో ప్రయివేటు వ్యక్తులకు చెందిన ఫెక్సీలను తొలగించారు. ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి ఎంపీడీఓ సత్యనారాయణ జాతీయ రహదారి పొడవున గల ఫ్లెక్సీలను తొలగింపు చేపట్టారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలని ఆయన కోరారు.



రోడ్డు భద్రతపై మెడికల్ విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రతి ఒక్క విద్యార్థి రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని డీటీఓ దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని



ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ఆవశ్యకత, ట్రిపుల్ రైడింగ్ దుష్పరిణామాలను వివరించారు. ఇందులో ఏఎంవీఐ ముర్తుజా అలీ, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ దినేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రానికి చెందిన సూది నందు, సూది వినాయక్‌ల తండ్రి సూది రాములు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతే కాకుండా సీనియర్ నాయకులు చట్ల గజ్జయ్య మామ సూది రాములు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షులు దుబ్బుల చంద్రశేఖర్, మండల కన్వీనర్ రాజారాం, నాయకులు దిసి రమణ, చిలుకూరి భూమన్న, అందె ప్రకాష్, జనార్ధన్ పాల్గొన్నారు.



గాంధీ ఆశయాలను కొనసాగించాలి



నవతెలంగాణ-కడెం

మహాత్మ గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహ్మాత గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల నాయకులు మాట్లాడారు. మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. యువత గాంధీ మార్గంలో నడువాలని సూచించారు. అనంతరం ఇటీవల బదిలీపై కడెం తహసీల్దార్‌గా వచ్చిన తహసీల్దార్ ప్రభాకర్‌ను కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు రేంకల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు వాజీద్ ఖాన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడిగెల భూషణ్, తాళ్లపెల్లి రమేష్, దుల్ల వెంకటేష్, పాకనాటి రాజేశ్వర్, ధర్మయ్య, రాజశేఖర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ మాట్లాడారు. గాంధీ స్పూర్తితో స్వరాష్ట్రాన్ని సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో సులేమాన్, దినేష్, సాయి, సాజిద్ పాల్గొన్నారు.

లోకేశ్వరం : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందన్నారు. ప్రజలను మబ్బిపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 140 హామీలను నెరవేర్చాలని మహత్మ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిగాంబర్, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భోజన్న, నాయకులు సిందే వేణు పటేల్, గణేష్, హరీశ్, ప్రకాష్, బోజారెడ్డి, వెంకటేష్, నల్ల నర్సారెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

రాజుర గ్రామంలో ...

మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని రాజురలో బీఆర్ఎస్ నాయకులు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గత ఎన్నికల్లో అమలు చేయడానికి సాధ్యం కానీ హామీలు ఇచ్చి ఇప్పటివరకు ఒక్క హామీని కూడా సక్రమంగా నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, అనిల్ గణపతి, భోజన్న, పెంటన్న, కలీం, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నో అమలు కాని హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని జిల్లా నాయకులు రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 420 రోజులు గడిచిన ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అనంతరం ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్ ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, నిర్మల్ జిల్లా జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని వాటిని పరిష్కరించే బుద్ధి ప్రసాదించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఓ మహాత్మా ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి కండ్లు తెరిపించు, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి దారి చూపించు, పార్టీ కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చేలా వారికి బుద్ధి ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : అహింస మార్గంతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నగేష్, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. గురువారం ప్రజా సేవ భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల కుంభమేళాల తొక్కిసలాటలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకురాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబానికి అండగా నిలవాలని అన్నారు. అహింసా మార్గంతో బ్రిటిష్ వారిని వణికించి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని తెలిపారు. నేడు అలాంటి గాంధీ కుటుంబానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన ప్రజల మద్దతుతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డితో పాటు నాయకులు గాంధీ చిత్రపటానికి పుష్పంజలి సమర్పించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కుంటాల రాములు, అరుణ్ కుమార్, అమీనా బేగం, పాషా ఉన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతున్న ఇచ్చిన 420 హామీలను అమలు చేయడం లేదని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్ అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్‌కు బుద్ధి ప్రసదించాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అంతకుముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ కేవలం 30 శాతం చేశారని, కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ తులం బంగారం, ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. కేసీఆర్ హయంలోనే ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చారే తప్ప నూతన నోటిఫికేషనుల ఇవ్వలేదన్నారు. ఇప్పటికైన ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ సాజిదొద్దిన్, రమేష్, నారాయణ, ధమ్మపాల్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : ప్రజలందరూ మహాత్మా గాంధీ చూపిన బాటలో ముందుకు సాగాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటి జాయింట్ కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో

జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు అతిక్ హైమ్మద్, కాంగ్రెస్ నాయకులు గాజుల రవి కుమార్, సభా కాలీమ్, దేవరకోట దేవస్థానం సభ్యులు సంతోష్, పట్టణ కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ అంబాజీ, మాజీ దేవరకోట దేవస్థానం సభ్యులు నాంపెల్లి నర్సయ్య, మాజీ కౌన్సిలర్ సలీమ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకాంత్, కాంబ్లీ, డి.రవి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రాకేష్ పాల్గొన్నారు.





బాధిత కుటుంబానికి సరుకులు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఈనెల 27న అగ్ని ప్రమాదం జరిగిన ఘటనలో ఓ వ్యక్తి ఇల్లు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న కాలనీకి చెందిన బీజేపీ నాయకులు భీంసేన్‌రెడ్డి బాధితులు సాయికిరణ్‌కు రూ. పది వేల విలువగల నిత్యావసర సరకులను గురువారం అందించి ఉదారత చాటుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు భీంసేన్‌రెడ్డి కోరారు. అంతకు ముందు కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రవి, విక్రం, జగదీష్, అశోక్, సంతోష్ పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోళు కేంద్రాల్లోనే పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. గురువారం పట్టణంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోళు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తొలి రైతును సత్కరించి తూకం వేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ కందులకు ప్రభుత్వం క్వింటాళుకు రూ.7వేల 550 ఇస్తుందన్నారు. రైతులు ప్రయివేట్ వ్యాపారులు, దళారులను నమ్మి మోసపోకుండా కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో తమ పంటను అమ్ముకొని మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, మార్కెట్ కార్యదర్శి మధుకర్, కేంద్రం ఇన్‌చార్జి పండరి పాల్గొన్నారు.

కంపెనీ భూములు రక్షించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

పెరల్స్ కంపెనీకి చెందిన భూములేనని, వాటిని రక్షించాలని గురువారం తహసీల్దార్ శ్రీదేవికి పెరల్స్ కంపెనీ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 30 సంవత్సరాల కింద అమ్ముకున్న భూములను మళ్లీ మాకే కావాలనడం హాస్యాస్పదంగా ఉందని పీఏసీఎల్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలో 1993-94 సంవత్సరంలో వంజర, తాండ్ర, కంకట, వైకుంఠాపూర్, చించోలి గ్రామాలలో సుమారు 500 ఎకరాల పైబడి వ్యవసాయ భూములను పిజిఎఫ్ పిఎసిఎల్ (పెరల్స్) కంపెనీలు కొనుగోలు చేశాయని అప్పటినుండి కంపెనీ సాగు చేస్తుందని, అట్టి భూములను 2016 సంవత్సరంలో గౌరవ లోదా కమిటీ ఆధీనంలో భూములు ఉన్నాయని, సుప్రీం కోర్టు, సీబీఐ, లోధా కమిటీ అబ్జర్వేషన్‌లోనే దేశవ్యాప్తంగా వేల ఎకరాల భూములు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎల్ ఇన్వెస్టర్ వెల్పర్ అసోసియేషన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొత్త శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల సైదులు, కోశాధికారి గుండెబోయిన వెంకటేశ్వర్లు సభ్యులు ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దు

- డీఈఓ ప్రణీత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని డీఈఓ ప్రణీత అన్నారు. గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో ఉపాధ్యాయులకు రెండు రోజుల జిల్లా స్థాయి కేరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్‌పై శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. డైట్ వైస్ ప్రిన్సిపల్ కోల కిరణ్ కుమార్ విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడంతో పాటు ఆత్మస్థైర్యం ఏ విధంగా పెంచాలో వివరించారు. ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ముందు తరువాత ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వాటిని తగ్గించలనే లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని డీఈఓ ప్రణీత తెలిపారు. తరగతి గదిలో విద్యార్థులు ఆత్మస్థైర్యం పెంచేలా బోధించడంతో పాటు భవిష్యత్తు లక్ష్యాలను ఏ విధంగా సాధించాలో వివరించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రెండు రోజుల శిక్షణలో తెలుసుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు ఎలియా, ప్రమోద్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన కలిగిఉండాలి



నవతెలంగాణ-నేరడిగొండ

వ్యాధుల పట్ల అవగాహన కలిగిఉండాలని హెచ్‌ఈఓ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని వడూర్‌లోని మిని గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు పలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఈఓ రవీందర్ మాట్లాడుతూ వడూర్‌లో టీబీ ఉందనే అనుమానంతో 32 మంది తెమడ పరీక్షలకు శాంపిల్స్ తీసుకున్నామని అన్నారు. టీబీ సోకిన వారికి రెండు వారాలకు పైగా దగ్గు తరచుగా జ్వరం రావడం చాతిలో నొప్పి ఆకలి వేయకపోవడం, చల్లగా చెమటలు రావడం రాత్రిపూట, మెడపై కంతుల్లా ఏర్పడటం లాంటివి జరుగుతాయని అన్నారు. టీబీ, మలేరియా, డెంగ్యూ ఇలాంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చినా కూడా వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, జగదీశ్వర్‌రెడ్డి, టి.శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్ఎం సంగీత, సౌందర్య, ఆశా వర్కర్స్, సుజాత, పుష్ప, సంధ్య పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని గాంధీచౌక్ కాలనీలో వాయుపుత్ర గణేష్ మండలి, గాంధీనగర్ కాలనీ ఆధ్వర్యంలో గురువారం నవగ్రహ విగ్రహ, యంత్ర ప్రతిష్ఠన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే శుక్రవారం రోజున ఉదయం 9.36 గంటలకు శతభిషం నక్షత్ర యుక్త మీన లగ్న పుష్కరాంశ సుముహూర్తమున యంత్ర ప్రతిష్ఠ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సైండ్ల శ్రీధర్ ఉమరాణి, టీఎన్ స్వామి, లక్కాకుల గిరిధర్, బొమ్మెడ పెద్ద పోశెట్టి, విరమల్ల గోపి, బొమ్మెడ గణేష్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేద్దాం

- జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలో కుష్టు వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా వైద్య కళాశాలలో నిర్వహించిన ప్రపంచ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని వైద్యశాఖ, లేప్రసీ సొసైటీ, మ్యాన్ కైండ్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నివారణకు కృషి చేద్దామని వైద్య విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 15 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు తెల్లని, ముదురు, గోధుమ రంగు కలిగిన మచ్చలు స్పర్శ లేనట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా పారామెడికల్ అధికారి రాజేశ్వర్, లేప్రా సొసైటీ ఫిజియోథెరపిస్ట్ కిషన్‌రావు, ప్రొఫెసర్లు డాక్టర్ దరహాస, గాయత్రి వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సావాలు నిర్వహించారు. అంకొలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని యాపల్‌గూడ సబ్ సెంటర్‌లో గ్రామస్తుల మధ్య అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. జనవరి 30 నుంచి 13వ తేది ఫిబ్రవరి వరకు ప్రతి గ్రామపంచాయతీ, ప్రతి గ్రామంలో అవగాహన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాలలో ప్రతి ఇంటిలో ఆడవారిని, మగవారికి విడివిడిగా పరీక్షించి ఎలాంటి మచ్చలున్న సంబంధిత ఆరోగ్య సిబ్బందికి చూపెట్టి పరీక్ష అనంతరం లెప్రాసి మచ్చలుంటే మందు మాత్రలను ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాపల్‌గూడ సెక్టార్ హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీదేవి, నల్ల ఈశ్వర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరి సమీరా, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్ : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం గ్రామాల్లో వైద్య సిబ్బంది కుష్టు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపెల్లి(హెచ్) జామడ, గుంజాల, బలాన్‌పూర్ పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేసి, ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు లేప్రసీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ ఆనంద్‌రావ్, ఉపాధ్యాయులు విజేష్, లత, చౌహన్ స్నేహ, వైద్య సిబ్బంది శ్యామక, జవహర్‌లాల్, అనసూయ, గ్రామస్తులు ఉన్నారు.



సమరయోధులను స్మరిస్తూ..మౌనం పాటించి

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర సమరయోధుల దినోత్సవం నిర్వహించారు. స్వాతంత్ర పోరాటంలో పోరాడి అమరులైన యోధులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జీఎం ఎం.శ్రీనివాస్ దేశ స్వాతంత్రం కోసం సాగిన పోరాటం నాయకుల దీక్ష, పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏరియా ఇంజినీర్ రామనాథం, డీజీఎం సెక్యూరిటీ ఎస్.ఉమాకాంత్, డీజీఎం (వర్క్ షాప్) కృష్ణమూర్తి, ఫైనాన్స్ మేనేజర్ ఎం.రవికుమార్, సివిల్ (ఎస్ఈ) మదీనాబాషా, సీనియర్ పర్సనల్ అధికారులు ఎం.శ్రీనివాస్, డి.ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న వేళ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆదేశాలతో జిల్లాలో 20 రోజుల నుండి కాంగ్రెస్ శ్రేణులు పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్నారు. గురువారం మండలంలోని బూరుగుడా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. దీంలో భాగంగా ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బురుగుడా మాజీ ఎంపీటీసీ మేకర్తి శ్రీనివాస్, నాయకులు మెకర్తి అరుణ్, శేకర్, నరేష్, చిలారి మల్లేష్, ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ కరపత్రాల విడుదల



నవతెలంగాణ-కౌటాల

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించే టాలెంట్ టెస్ట్ కరపత్రాలను కౌటాల సీఐ ముత్యం రమేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం లేకుండా ఉండడానికి టాలెంట్ టెస్టు తోడ్పడుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు డి.అనికేత్, మండల కార్యదర్శి సాయినాథ్, నితీష్, ఉమేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లారం పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-బెజ్జూరు



మండలంలోని ఎలుకపల్లి, చిన్న సిద్ధాపూర్ గ్రామ శివారులోని దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువైన ఎల్లారం పోచమ్మ విగ్రహ పున ప్రతిష్టాపన గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. భాజా భజంత్రీల మధ్య పురోహితులు వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇరువురు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ముందుగా దేవత విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించి గర్భగుడిలో మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అనంతరం హోమ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపనకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అభయాంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షులు కొ్టంగి రామకృష్ణ, రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడిపల్లి మహేష్, కంకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య, ఎల్లారం పోచమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు కొండవీటి భాస్కరరాజు, సుధాకర్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని బంబారా, గోయగాం, చొప్పన్‌గూడ గిరిజన గ్రామాల్లో గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారాం ఆధ్వర్యంలో గిరిజన కళాజాత బృందం కళాకారులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోండి, కొలాం, మరాఠి, తెలుగు భాషల్లో పాటలు పాడుతూ ఆరోగ్య విషయాలు, పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఎంఓ వాసుదేవ్, హెచ్ఈఓ రవిదాస్, ఎంఎల్‌హెచ్‌పీ రియాజ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగపూర్ జాతర రోడ్డును పరిశీలించిన ఏఎస్పీ

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఫిబ్రవరిలో జరిగే జాతరకు ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డును ఏఎస్పీ చిత్తానిరంజన్ పరిశీలించారు. పోలీసులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తు పనులు పూర్తలయ్యే చూడాలన్నారు.ఆయన వెంట సీఐ బుద్దె స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఆర్టీఏ నాన్ అఫిషియల్ మెంబర్ లావుడ్య రమేష్, ఆలయ చైర్మెన్ లెండుగురే జయరాం, మొర్లె తులసీరామ్, సోన్లే సంతోష్ ఉన్నారు.

పీఎల్ఐ ప్రత్యేక డ్రైవ్‌లను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుండి పీఎల్ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) 141 ఏండ్ల వార్షికోత్సవం ఉన్నందున ప్రత్యేక డ్రైవ్‌లను ప్రతి పోస్ట్ ఆఫీస్ కార్యాలయాలలో జయప్రదం చేయాలని సిర్పూర్ కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్స్పెక్టర్ అధికారి సిరికొండ సతీష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ తపాలా కార్యాలయంలో వాంకిడి, చిర్రకుంట, ఆసిఫాబాద్ తపాలా కార్యాలయాలకు సంబంధించిన సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. గ్రామీణ ప్రాంతాల లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ సబ్ పోస్ట్ మాస్టర్ యోగేష్, పోస్టల్ అసిస్టెంట్ ప్రశాంత్ రానా సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను జీఎం ఎం.శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం కె.రాజ మల్లు, డీజీఎం సెక్యూరిటీ ఉమాకాంత్, సంఘం నాయకులు అనిల్ కుమార్, బి.రవీందర్, ఎస్.రమేష్, రాజబాబు, శ్రీనివాస్, ఓ.కిరణ్, జి.కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

అల్పాహారం..ఆకలికి ఉపశమనం

- పది విద్యార్థులకు ప్రభుత్వం కొత్త పథకం
- సాయంత్రం పూట స్నాక్స్ అందజేత
- రేపటి నుండి 59 పాఠశాలల్లో అమలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం రానున్న పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలనే ఉద్దేశంతో మొదటి నుండి ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. దీనిలో భాగంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభానికి 38 రోజులున్న నేపథ్యంలో సాయంత్రం పూట నిర్వహించే అదనపు తరగతుల్లో వారికి ప్రత్యేకంగా స్నాక్స్ అందజేయడానికి నిర్ణయించింది. దీన్ని రేపటి నుండి అమలు చేయాలని ఉత్తర్వులు కూడా జారీ చేసంది. ఇందులో భాగంగానే జిల్లాలోని 59 పాఠశాలల్లో అమలు నేపథ్యంలో ప్రత్యేక కథనం.

పది విద్యార్థులకు కొత్త పథకం

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందజేయడానికి ప్రభుత్వం నిర్ణయించి కొత్త పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. సాయంత్రం పూట స్టడీ అవర్‌లో దీనిని అనుసరించనున్నారు. విద్యాశాఖ దీని అమలు బాధ్యతను మధ్యాహ్న భోజన కార్మికులకు అందజేయడంతో పాటు ప్రతి విద్యార్థికి రోజుకు రూ.15 చెల్లించనుంది.

సాయంత్రం పూట స్నాక్స్ అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచడంతో పాటు ఉత్తమ ఫలితాన్ని సాధించడం లక్ష్యంగా ప్రభుత్వం సాగుతోంది. ఇదే క్రమంలో విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందజేయడానికి నిర్ణయించింది. సోమవారం నుండి శనివారం వరకు ఆరు రోజులు ఆరు రకాల మెనూ సిద్ధం చేసింది. విద్యార్థులకు పల్లి బెల్లం, ఉడకపెట్టిన పెసర్లు, ఉడకపెట్టిన బబ్బెర్లు, మిల్లెట్ బిస్కెట్స్, ఉల్లిగడ్డ పకోడీ, ఉడకపెట్టిన శనగలు అందజేయనున్నారు.

జిల్లాలో 59 పాఠశాలల్లో అమలు

విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో జిల్లాలోని 59 పాఠశాలల్లో స్నాక్స్ పథకాన్ని అమలు చేయడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. 7 ప్రభుత్వ పాఠశాలలో 267మంది, 50 స్థానిక సంస్థల పాఠశాలలో 2168 మంది, 2 ఆదర్శ పాఠశాలల్లో 166 మంది లబ్ధి పొందనున్నారు. దీంతో విద్యార్థుల ఆకలి తీరనుంది.

ఉత్తమ ఫలితాలకు ఉపయోగపడుతుంది

ఉదయబాబు, జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4.15 నుండి 5.15 వరకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందజేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇదే సందర్భంలో ఉత్తమ ఫలితాలు సాధనకు కూడా ఇది దోహదం చేస్తుంది.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

హేమంత్ షిండే, ప్రభుత్వ ఉపాధ్యాయుడు



పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందజేయడానికి తీసుకున్న నిర్ణయం హర్షణీయం. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం వరకు ఉండడం కొంత ఇబ్బందిగా మారుతుంది. ఈ సమయంలో పరీక్షలు దగ్గర పడుతున్న వేళ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీయాలి



నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యలను వెలికి తీయాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని గోయాగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్‌లోని వివిధ పాఠశాల విద్యార్థులకు రీడింగ్ స్కిల్స్‌పై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చదవడం, రాయడం విద్యార్థులకు ఎంతో ముఖ్యమైన నైపుణ్యమని తెలిపారు. అనంతరం విద్యార్థుల రీడింగ్ స్కిల్స్‌ను పరిశీలించి ప్రతిభ కనభర్చిన విద్యార్థులకు బహుమతులిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, జైనూరు మండల విద్యాధికారి మధుసూదన్, ఉపాధ్యాయులు రమేష్, విష్ణువర్ధన్, భరత్ రావు, జయవంత పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని ఎంపీయూపీఎస్ బెండారా పాఠశాల, ఇందానీ గ్రామంలోని జడ్‌పీహెచ్ఎస్, బంబారా గ్రామంలోని ఏహెచ్ఎస్ కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు, ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రూమ్ టు రీడ్ సంస్థ వారు అందించిన బ్లూ, ఎల్లో కలర్ పుస్తకాలలో ఉన్న అంశాలు లేదా ఆ స్థాయి అంశాలపై టీఎం, ఈఎంలలో పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందానీ కాంప్లెక్స్ సెక్రటరీ నవీన్ మాట్లాడుతూ పఠన పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో విద్యపై ఆసక్తి పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. పఠన పోటీల్లో తెలుగు విభాగంలో ఇందానీ కాంప్లెక్స్ పరిధిలోని ఒడ్డెరవాడ ఎంపీపీఎస్ విద్యార్థి నాగోసె లక్ష్మీ, బంబారా కాంప్లెక్స్ పరిధిలోని సోనాపూర్ ఎంపీపీఎస్ విద్యార్థిని శివానీ, ఇంగ్లీష్ విభాగంలో ఇందానీ కాంప్లెక్స్ పరిధిలోని లెండిగూడ ఎంపీపీఎస్ విద్యార్థి ఆకాశ్ విజయం సాధించారు. పోటీలో గెలుపొందిన ఇద్దరు విద్యార్థులు ఫిబ్రవరి ఒకటిన జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రవి, సుశీల్, సాయికుమార్, అజయ్, అరవింద్, శంభు, మహేందర్, సచిన్, వినోద్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ దుర్గం సందీప్ పాల్గొన్నారు.



కుష్టు, క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

- వ్యాధులను నిర్మూలించడం లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుష్టు వ్యాధి ప్రాచీన కాలం నుండి మానవజాతిని పట్టిపీడిస్తున్న వ్యాధి. మనిషి నాడీ మండల వ్యవస్థ మీద దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా చేతులు కాళ్ల దీని ప్రభావానికి ఎక్కువగా లోనవుతాయి. రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, బయోరంగం విస్తరిస్తుండడంతో ఈ వ్యాధికి మందులు వచ్చాయి. సరైన జాగ్రత్తలు పాటిస్తే ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చు. ప్రాణాలు తీసే క్షయ వ్యాధి మైకోబ్యాక్టీరియమ్ టూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల సోకుతోందని 1882 మార్చి 24న జర్మనీ శాస్త్రవేత్త రాబర్ట్ కుచ్ కనుగొని నివారణకు ప్రయత్నించాడు. ఈ రెండు వ్యాధుల ప్రభావం వెనుకబడిన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు నేటి నుండి సెప్టెంబర్ 12 వరకు జిల్లాలో రెండు వ్యాధులపై అవగాహన కల్పించడమే కాకుండా వాటి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు.

క్షయ వ్యాధి లక్షణాలు

గొంతులో ఏదో (కఫం) ఉన్నట్లు దగ్గు వస్తూ ఉంటుంది. దగ్గకుండా ఉందామన్నా ఉండలేం. పొడి దగ్గు వస్తూ ఉంటుంది. రెండు వారాల్లో పొడి దగ్గును తగ్గించేసుకోవాలి. లేదంటే అదే క్షయ వ్యాధి వచ్చేందుకు కారణం అవుతుంది. క్షయ వస్తే ఇక దగ్గు ఆగదు. సాయంత్రం, రాత్రి వేళల్లో జ్వరం ఉంటుంది, చెమటలు పడతాయి. బరువు తగ్గిపోతుంటారు. ఇది స్పష్టంగా కనిపించే లక్షణం. పెద్దగా పనిచెయ్యకపోయినా ఆయాసం, నీరసం వస్తుంది. వ్యాధి ముదురుతూంటే, దగ్గుతో పాటూ (కఫంతోపాటూ) రక్తం కూడా వస్తుంది.

వ్యాధి రాకుండా ఇలా చేయాలి

మంచి ఆహారం తీసుకోవాలి. స్పైసీ (మసాలా) ఫుడ్ తగ్గించాలి. దగ్గు, జలుబు, జ్వరం లాంటి వస్తే డాక్టర్‌ను సంప్రదించి వాటిని వీలైనంత త్వరగా తగ్గించుకోవాలి. రెండు వారాల కంటే ఎక్కువ రోజులు పొడి దగ్గు వస్తూ ఉంటే, వెంటనే డాక్టర్‌ను కలిసి తెమడ పరీక్ష చేయించుకోవాలి.

వచ్చిన వ్యాధి తగ్గాలంటే...

వ్యాధి నిర్ధరణ పరీక్షలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచితంగా చేస్తారు. క్షయవ్యాధి ఉన్న వారికి నెలకు రూ.500లను ప్రభుత్వం నేరుగా బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తోంది. కొంతమందిలో సాధారణంగా మందులు వాడగానే వ్యాధి తగ్గిపోతుంది. మందు, పొగాకు అలవాట్లు ఉన్న వారికి ఎండీఆర్ టీబీ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీ)గా మారుతుంది. వ్యాధి నిర్ధారణ సమయంలో రోగికి సాధారణ టీబీ ఉందా లేక ఎండీఆర్ టీబీ ఉందా అనేదానిని నిర్ధారిస్తారు. క్షయకు ఇచ్చిన మందులు ఎక్కువ కాలం వాడాల్సి ఉంటుంది. మధ్యలో మానేస్తే ప్రమాదం.

కుష్టు వ్యాధి లక్షణాలు..

శరీరంపై పాలిపోయిన లేదా రాగిరంగు మచ్చలు. మచ్చలపై స్పర్శజ్ఞానం ఉండదు. నొప్పి తెలియదు. శరీరంలో పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మెరలు వస్తాయి. చర్మం దళసరిగా, చర్మం, ముఖం నూనె రాసినట్లు నిగనిగలాడుతు ఉంటుంది. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదిస్తే చికిత్సలు ప్రారంభిస్తారు.



సర్వేలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు(ఫైల్)

నివారణోత్సవాల లక్ష్యాలు

నేటి నుండి చేపట్టే పక్షోత్సవాలు భాగంగా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తారు. ప్రజలలో కుష్టు వ్యాధిపై అవగాహన పెంచడం, వ్యాధి బారినపడ్డ వారికి అవసరమైన మేరకు సాధారణ, ఉచిత చికిత్స అందించడం. వ్యాధి బారినపడిన వ్యక్తికి చర్మంపై వచ్చే పుండ్లు, నరాల బలహీనత వల్ల భౌతిక లోపాల విషయంలో మానసిక ధైర్యం పెంపొందించడం.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో కుష్టు క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే ఉద్దేశంతో జిల్లాలో నేటి నుండి పదిహేను రోజులపాటు వైద్య సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. దీని కోసం 780 మంది ఆశా కార్యకర్తలు 780 మంది వాలంటీర్లను ఉపయోగించనున్నారు. గత సంవత్సరం నిర్వహించిన పరీక్షల్లో 101 మందికి కుష్టు వ్యాధి ఉన్నట్టు అనుమానించేగా వారికి సరైన చికిత్స చేసి ఈ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం చేపట్టే సర్వే సంబంధించి జిల్లా వైద్యాధికారి సీతారాం నేతృత్వంలో రెండు రోజుల క్రితం జిల్లాలో వైద్య సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం

సీతారాం, జిల్లా వైద్య అధికారి



జిల్లాలో క్షయ కుష్టు వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. దీనికోసం 15 రోజులపాటు సర్వే నిర్వహించనున్నాం. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించడంతో పాటు నివారణకు అవసరమైన మందులు అందజేస్తు పాటించాల్సిన అంశాలను వివరిస్తున్నాం. అంతర్గతంగా మచ్చలంటివి ఉన్నవారు తప్పనిసరిగా సర్వే సిబ్బందికి తెలియజేయాలి. అప్పుడే వ్యాధిని నివారించడానికి అవకాశం ఉంటుంది. వ్యాధి రహిత జిల్లా చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు



నవతెలంగాణ-కెరమెరి

గురుకుల ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి అయన మాట్లాడారు. వివిధ గురుకులాల్లో ప్రవేశ పరీక్షల కోసం కులం, ఆధాయం, ధ్రువీకరణ పత్రాలతోనే ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వంలో ప్రవేశ పరీక్షల కోసం దరఖాస్తులు కేవలం బోనఫైడ్ ఆధారంతో చేసుకునే వెసులుబాటు ఉండేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వివిధ ప్రవేశ పరీక్షల నిమిత్తం కులం, ఆధాయం పత్రాలను తప్పనిసరి చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా అనేక కుటుంబాలకు రేషన్ కార్డులు లేకపోవడంతో కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి బోనఫైడ్ ఆధారంతో దరఖాస్తులు చేసుకునే విధంగా సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకటి, గోపి, నాగేష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధుల నిరోధన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో వ్యాధుల వ్యాప్తిని నిరోధించవచ్చని జిల్లా మహిళ, శిశుసంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం ద్వారా పరిశుభ్రతపై మెట్రో ఫెసిలియేటర్ ఎస్‌జీఓ భాను కల్లకూరి విద్యార్థినులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత కార్యకలాపాల ద్వారా వ్యాధుల వ్యాప్తిని నిరోధించవచ్చని, పీరియడ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై తెలియజేశారు. సరైన సమయంలో తీసుకోవలసిన ఆహారం, పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత అంశాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది శారద, రాణి, సాగర్, రాజేశ్వరి, మమత, విద్యార్థినులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే లక్ష్యం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక యూనియన్ టీయుడబ్ల్యూజే (ఐజేయు) అని జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సంపత్ కుమార్ అన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, నివాస స్థలాల సాధన విషయంలో రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు నామ తిరుపతి, నాయకుడు మిలిన్ కుమార్, పాత్రికేయులు తిరుపతి, శ్రీధర్, కమలాకర్, రాజేష్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వృత్తి పట్ల ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, అప్పుడే విద్యార్థుల అభివృద్ధి సాధ్యమవుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ ఘమినియల్ అభిప్రాయపడ్డారు. వృత్తి మార్గదర్శకత్వం మీద జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 77 ఉన్నత పాఠశాలల నుండి ఎంపిక చేసిన విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి పట్ల అంకితభావం కలిగి ఉండాలని, విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం వహించి విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లేలా చూడాలన్నారు. ఉన్నత ఉద్యోగం సాధించేలా విద్యా బోధన చేయాలని, విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలవాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యంగా పదవ తరగతితో పాటు అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఎలాంటి మానసిక ఒత్తిడి, ఆందోళనకు లోను కాకుండా విద్యార్థులకు కౌన్సెలింగ్ చేయాలని ఉపాధ్యాయులకు దిశా, నిర్దేశం చేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు అమరేందర్ రెడ్డి, సమత పాల్గొన్నారు.

బ్యానర్లు, పోస్టర్లను తొలగించిన సిబ్బంది

నవతెలంగాణ-వాంకిడి

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా మండలకేంద్రంలో గోడలపై ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలను, వాల్ పోస్టర్లను గురువారం సిబ్బంది తొలగించారు. ఎలక్షన్ అయ్యేవరకు ఎలాంటి పోస్టర్లు, బ్యానర్లు ఏ పార్టీ వారైనా పెట్టొద్దని తహసీల్దార్ రియాజ్ అలీ తెలిపారు. అందరూ సహకరించాలని కోరారు.

నేడు వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో శుక్రవారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు, కలుష పూజ, అనంతరం 102 కలశాలతో పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు ఆలయంలో సామూహిక కుంకుమ పూజల అనంతరం లక్ష్మీ గణపతి హోం, వాసవి కన్యకా పరమేశ్వరి హవనం ఉంటుందని, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని భక్తులు హాజరుకావాలని పేర్కొన్నారు.

పట్టుకున్న గ్యాస్ సిలెండర్ల విడుదల

నవతెలంగాణ-జన్నారం



మండలకేంద్రంలో సోమవారం పట్టుకున్న ఇండియన్ గ్యాస్ సిలెండర్ల వాహనాన్ని అధికారులు విడుదల చేశారు. సోమవారం దండేపెల్లి మండలం నుండి జన్నారం మీదుగా 62 సిలెండర్‌లతో వెళుతున్న బుల్లోరా వాహనాన్ని సరైన పత్రాలు లేనందున మండల రెవెన్యు అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న సమయంలో వాళ్ళ దగ్గర బిల్లులు లేకపోవడంతో సిలిండర్లను భారత్ గ్యాస్ గోదాంకు తరలించారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకులు దానికి సంబంధించిన బిల్లులను చూపించడంతో వాహనాలను సిలిండర్లను విడుదల చేసినట్లు ఆర్ఐ భానుచందర్ తెలిపారు. అవి అక్రమంగా తరలివెళ్తున్నాయని పట్టుకున్నామని, సరైన బిల్లులు తీసుకురావడంతో వాహనాన్ని సిలిండర్లను విడుదల చేశామన్నారు.

బీసీ రాజకీయ యుద్ధ భేరికి తరలిరండి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ఫిబ్రవరి 2న వరంగల్‌లో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరికి బీసీలందరూ తరలి రావాలని తెలంగాణ బీసీ జేఏసీ కన్వీనర్ కళ్యాణం రవి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఐబీ విశ్రాంత భవన్‌లో యుద్ధ భేరి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్స్ కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్స్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి మనోహర్, గొల్లకూర్మల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాజన్న యాదవ్, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్, నాయకులు పాదం శ్రీనివాస్, జిన్ని వెంకటేష్, తిరుపతి పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మద్యానికి బానిసై కమెర వరప్రసాద్(23) యువకుడు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ పి.సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మృతుని తండ్రి సంవత్సరం క్రితం అనారోగ్యంతో మరణించడంతో మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం బయట అప్పులు చేసి అవి తీర్చలేక మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని చెల్లి భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై-2 రామయ్య దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు.

పెద్దపులి సంచారం

- భయాందోళనలో గ్రామస్తులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని బుగ్గగూడెం శివారులోని అటవీ సమీపంలో పెద్దపులి సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళకు గురవుతున్నారు. బుగ్గగూడెం శివారులో ఫారెస్ట్ అధికారులు పర్యటిస్తున్న క్రమంలో పెద్దపులి పాదముద్రలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సమీప శివారు గ్రామస్తులు అటవీలోకి వెళ్లరాదని, వ్యవసాయ పనులు చేసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని, పశువుల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లొదని అవగాహన కల్పించారు.

ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల ధ్యేయం

నవతెలంగాణ-దండేపల్లి



ప్రజలకు రక్షణ భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమని గ్రామాల్లో అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని శాంతి భద్రతలకు అందరూ సహకరించాలని ఏఎస్ఐ పసర్తి రాజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే డయిల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన ఇందారం జూనియర్స్

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పదవీ కాలం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఇందారం జూనియర్స్ జట్టు విజేతగా నిలిచింది. క్రికెట్ టోర్నమెంట్ ముగింపులో గురువారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డులు అందజేశారు. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీవీ క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ గ్రామాలకు చెందిన 34 జట్లు పోటీల్లో పాల్గొనగా ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో ఇందారం జూనియర్స్ జట్టును విజయం సాధించిన జట్టుకు రూ.30 వేలు నగదు అందజేశారు. అదేవిధంగా ద్వితీయ స్థానంలో నిలిచిన కానుకూరు జట్టుకు రూ. 15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఎల్కంటి జట్టుకు రూ. 5 వేలు నగదు అందజేశారు. ఇందారం గ్రామానికి చెందిన క్రీడాకారుడు అబ్బు మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా అవార్డు అందుకోగా ఇందారం జూనియర్స్ వర్సెస్ కానుకూరు జట్టు మధ్య ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి.

సోమగూడెం(కె)లో పోలీస్ పల్లెనిద్ర

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీలో బుధవారం రాత్రి పోలీస్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ స్థానికులతో సమావేశం నిర్వహించి సమస్యలు, గ్రామ పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంకె రవి, చింతల భీమయ్య తేంద్ర శ్యాం, గ్రామస్తులు పాల్గొన్నారు.


హైకోర్టు తీర్పుతోనే మున్సిపల్ ఎన్నికలు

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలు జరగాలంటే హైకోర్టు తీర్పుతోనే సాధ్యమవుతుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం దీపక్‌నగర్‌లో మందమర్రి స్థానిక సంస్థల ఎన్నికల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మందమర్రి పూర్తిస్థాయి షెడ్యూల్డ్ ఏరియా మ్యాప్‌ను ఎమ్మెల్యేకు వివరించి మందమర్రిలో ఎన్నికల నిర్వహించాలని జేఏసీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుప్రీం కోర్టు నిబంధన మేరకు జేఏసీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించి కలెక్టర్ దీపక్ కుమార్ పూర్తి వివరాలతో హైకోర్ట్‌లో జేఏసీ పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేసినట్లు తెలిపారు. హైకోర్టు తీర్పు వెల్లడించిన తర్వాత మందమర్రిలో ఎన్నికలు జరుగుతాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు గుడికందుల రమేష్, కార్యదర్శి మేసినేని అరుణ్ కుమార్, న్యాయవాది శ్రీనాథ్ చారి, ఉపాధ్యక్షుడు మాయా శ్రీనివాస్, సభ్యులు రామంచ తిరుపతి, బీమ్ సేన్, ముజాహిద్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి

నవతెలంగాణ-జైపూర్



స్వాతంత్రం కోసం సమరయోధుల త్యాగాలు మరువలేనివని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎస్టీపీపీ అధికారులతో కలిసి స్వాతంత్ర అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. వారి సేవలను స్మరిస్తూ మౌనం పాటించారు. అనంతరం ఈడీ మాట్లాడుతూ 200 ఏండ్లు బ్రిటీష్ పాలనలో మగ్గిన భారతవనికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం ఎందరో త్యాగధనులు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. అహింస మార్గంలో జాతిపిత మహాత్మాగాంధీ అనేక పోరాటాలు చేశారిని ఆయనతో పాటు మరెందరో స్వాతంత్ర పోరాలు చేశారని తెలిపారు. ఇందులో ప్లాంట్ చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎం సివిల్ కేఎస్ఎన్ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం ఈఅండ్ఎం మదన్ మోహన్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూఅక్రమార్కులపై ప్రజల ఎదురుదాడి

- అధికారులకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలు



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో భూ అక్రమార్కులపై ప్రజలు ఎదురుదాడి ప్రారంభించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి తిరిగి పేద ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న నాయకుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు కూల్చివేసి స్వాధీనం చేసుకోవాల్సిందేనని అధికారులకు మద్దతు పలుకుతున్నారు. పట్టణంలోని గల్లీలలో ప్రభుత్వ భూముల స్వాధీనం చేసుకున్న స్థలాల వివరాలను రెవెన్యూ శాఖ అధికారులకు తెలియజేసి ప్రభుత్వానికి సహకరిస్తున్నారు. అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేసే సమయంలో అడ్డుపడ్డ నాయకులను ఎదురు తిరిగి ప్రశ్నిస్తున్నారు. ఉన్న భూములను మీరు ఆక్రమించుకుంటే మేము ఎక్కడికి పోవాలి ప్రభుత్వ భూముల్లో ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయని బుధవారం అక్రమ కట్టడాల కూల్చివేత సమయంలో ప్రజలు అక్రమనదారులకు వ్యతిరేకంగా మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో సంచలనం రేపుతూ మిగతా ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని రేకెత్తించింది. ఎదురు తిరిగిన ప్రజల మాటలు అక్రమార్కుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి .

అక్రమాలకు పాల్పడుతున్న పలుకుబడిదారులు

.బెల్లంపల్లి సర్వే నెంబరు 170లో వందలది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. బెల్లం ఫ్యాక్టరీ, బొగ్గు బావుల విస్తరణ జరిగిన రోజుల్లో బెల్లంపల్లికి ప్రాంతానికి వలస వచ్చిన కార్మికులు ఇక్కడ నివాసాలు ఏర్పర్చుకున్నారు. 170లోని కొంత భూభాగాన్ని ప్రభుత్వం సింగరేణికి అప్పగించింది. మరలా సింగరేణి తిరిగి ప్రభుత్వానికి ఇచ్చింది. ఇదే అదనుగా భావించిన కొందరు పలుకుబడి నాయకులు, వ్యాపారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన నిర్మాణాలను ఇంటి స్థలాలను తిరిగి పేద ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అమాకులైన ప్రజలు కొనుగోలు చేసి మోసపోతున్నారు.

అక్రమాలకు చెక్ పెట్టేందుకు అధికారులు కసరత్తు

పట్టణంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్న పూర్తి ఫలితాన్ని ఇవ్వడం లేదు. గతంలో ఆర్డీఓ హరికృష్ణ పర్యవేక్షణలో పోలీస్ రెవెన్యూ ప్రభుత్వ ఉద్యోగులతో కూడిన ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూముల అక్రమణాలను అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకున్న వ్యూహం పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఆలోచనలో పడ్డ అధికారులు ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ భూముల అక్రమణలను కట్టుదిట్టం చేసేందుకు వ్యూహాత్మకమైన చర్యలు తీసుకుంటున్నారు. భూ అక్రమములపై వచ్చిన ప్రతి ఫిర్యాదును ఫిర్యాదులను స్వీకరించి స్పందిస్తున్నారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తున్నారు. అధికారులకు అడ్డు తలుగుతున్న నాయకుల ప్రమేయాన్ని తప్పించుటం కోసం ఇన్నాళ్లు వేసి చూశారు. మున్సిపల్ పాలకవర్గం ఈనెల 28న ముగియడంతో అధికారులు అక్రమ నిర్మాణాల తొలగింపుకు రంగంలో దిగారు. బుధవారం సర్వే నంబర్ 170లోని అంగన్‌వాడీకి కేటాయించిన భూమిలో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ప్రజల భాగస్వామ్యంతో అక్రమాలకు అడ్డుకట్ట



జ్యోత్స్న, తహసీల్దార్ బెల్లంపల్లి

పట్టణంలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల తొలగింపుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ భూముల అక్రమలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన స్పందిస్తున్నాం. ప్రజలను చైతన్యపరిచి వారి భాగస్వామ్యంతో ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తున్నాం. కార్యనిర్వాహక పనులకు అడ్డుపడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలు గృహ నిర్మాణాలు, ఇంటి స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు రెవెన్యూ అధికారులను సంప్రదించాలి.

కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది



నవతెలంగాణ-జైపూర్

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, 6 గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుతోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గం నాయకులు డాక్టర్ రాజా రమేష్ ఎద్దేవా చేశారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో నివాళ లర్పించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ హామీల చిట్టాను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని, అమలుకు వీలుకాని హామీలు ఇచ్చి చేతకాని ప్రభుత్వం రోజుకో మాట అన్నట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్నారం : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 420 రోజులు పూర్తి చేసుకుంటున్నా ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి అన్నారు. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. ముందుగా మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి జాడి గంగాధర్, జిల్లా నాయకులు ఫజల్ ఖాన్, కేప నరసింహులు, సిపతి ఆనందం, కమ్మల విజయ ధర్మ, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

దండేపల్లి : అధికారమే లక్ష్యంగా తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేసీఆర్ పాలనలోనే ప్రజలు ఆనందంగా ఉన్నారని ప్రజలను దరఖాస్తులతోనే మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల్లో చదువుచున్న 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ-అవగాహన తరగతులు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ కాలేజీ బాలికల వసతి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు 50 రోజుల సమయం ఉందని సమయాన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని, కఠినమైన విషయాలపై ఎక్కువ టైం కేటాయించాలన్నారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని, వాటిని సాధించడం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు 10వ తరగతి స్టడీ మెటీరియల్స్‌ని అందించారు. జిల్లా విద్యాధికారి, ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్ మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలో సిలబస్ పూర్తి చేయడం జరిగిందని, రివిజన్ జరుగుచున్నాయని, చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమానికి జిల్లాలోని అనుభవం కలిగిన నిష్ణాతులైన సబ్జెక్టు టీచర్స్‌ని పంపించామని, వారు చెప్పే ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవాలని, వాటిని పాటించి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఇందులో జిల్లాలోని ఎస్సీ వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వివేక్

నవతెలంగాణ-జైపూర్

పట్టువిడుపు ఉన్నప్పుడే సమస్యకు పరిష్కారం ఉంటుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రామారావుపేట్ నుండి గోదావరినది వరకు గల రోడ్డును గురువారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఇందారం ఓసీ డంపు అవసరార్థం మరో 129 ఎకరాల భూమిని సింగరేణి తీసుకోవల్సిఉండగా ఎకరాకు రూ. 30 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్న గ్రామస్తుల డిమాండ్ పట్ల ఎమ్మెల్యే స్పందించారు. వాజిబైన రేటు అడుగాలి తప్పా పట్టువిడుపు లేకుండా మాట్లాడితే సమస్యకు పరిష్కారం లభించదన్నారు. పురాతనం నుండి ఉన్న రోడ్డు కూడా భూసేకరణలో వచ్చిందని సింగరేణి అధికారులు వివరణ ఇవ్వగా మిగులు భూమి తీసుకునే వరకు రోడ్డును యధావిధిగా కొనసాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామస్తులకు ఇబ్బంది కలగకుండా పనులు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు పోకుండా మరో వైపు నుండి రోడ్డు వేసుకోవడంలో గల ఇబ్బందులు అడిగి తెలుసుకోని ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు వివరించారు. ఉన్న రోడ్డును మూసివేయకుండా పనులు చక్కబెట్టుకోవాలని ఆదేశించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తు సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

భవిష్యత్ తరాలకు గాంధీజీ ఆదర్శనీయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

భవిష్యత్ తరాలకు గాంధీజీ ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. గురువారం పట్టణంలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మహాత్మా గాంధీ 77వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇందులో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.డేవిడ్ పాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమాన్ని తనిఖీ చేసిన గిరిజన కార్పొరేషన్ చైర్మన్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మల్కెపల్లి రేగులగూడెం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలను తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అందిస్తున్న వసతులు, భోజనం, విద్యపై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. చైర్మన్ వెంట జిల్లా ఆదివాసీ సేనా అధ్యక్షులు పెంద్రం శ్రీను, మండల అధ్యక్షులు మడావి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, పెంద్రం తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీశ్రీ పాహుండి కుపర్ లింగు స్వామి జాతర

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కుర్రేఘడ్ శివారులోని ఆదివాసుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ పాహుండి కుపర్‌లింగు స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి హాజరై దర్శనం చేసుకున్నారు. శ్రీశ్రీశ్రీ పాహుండి కుపర్ లింగు స్వామి దేవాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పూర్ణచందర్, డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్థానికేతర వాహనాలకు అనుమతి లేదు

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ అభయారణ్య పరిధిలోని ఇంధనపల్లి చెక్ పోస్ట్ మీదుగా రాత్రివేళ స్థానికేతర వాహనాలకు అనుమతి లేదని, ఈ విషయాన్ని ప్రజలు, వాహనదారులు గమనించాలని ఇంధన్‌పల్లి అటవీ రేంజ్ ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్, తాళ్లపేట, జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు అన్నారు. గురువారం ఈ విషయమై వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్ట్ రాత్రి 9 నుండి తెల్లవారు జామున 6 గంటల వరకు మూసి వేయడం జరుగుతుందన్నారు. అయితే స్థానికుల వాహనాలకు అనుమతి ఉంటుందని, స్థానికేతర వాహనాలు అనుమతించబోమన్నారు. స్థానికులు సాధ్యమైనంతవరకు త్వరగా వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రయత్నించాలని, ఒకవేళ ఆలస్యమైతే స్థానికులుగా గుర్తించేందుకు ఆధార్‌కార్డు లాంటి పత్రాలను చూపించాల్సి ఉంటుందన్నారు. ఆర్టీసీ, అంబులెన్స్, తదితర ఎమర్జెన్సీ వాహనాలకు మినహాయింపు ఉంటుందన్నారు. స్థానిక వాహనాలకు సెజ్ చార్జీ ఉండదన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అటవీ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కవ్వాల్ అభయారణ్య రక్షణకు అందరం కృషి చేస్తు సహకరించాలని కోరారు.

అర్హులు పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ చేసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతన్న పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ అర్హులైన ప్రతి ఒక్కరు చేసుకోవాలని ఎస్‌బీఐ మంచిర్యాల రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ అన్నారు. భీమారం ఎస్‌బీఐ ద్వారా పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ చేయించుకున్న ఆరెపల్లి గ్రామానికి చెందిన దర్గం తిరుపతమ్మ మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులకు గురువారం రూ. 20 లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకం ద్వారా ఇన్సూరెన్స్ చేసుకున్న మచ్చ విజయలక్ష్మి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం భీమారం ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సుబ్బారెడ్డి, ఎస్‌బీఐ సీఎస్ఎం బుచ్చిబాబు, ఐకేపీ ఏపీఎం త్రయంబకేశ్వర్‌తో కలిసి మాట్లాడారు. ఇన్సూరెన్స్‌తో కుటుంబ సభ్యులకు ఆర్థిక తోడ్పానిస్తుందన్నారు. కార్యక్రమంలో భీమారం ఎస్‌బీఐ సిబ్బంది అజయ్, రాజశేఖర్, లిఖిత, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ మహేందర్, ఖాతాదారులు అత్యధికంగా పాల్గొన్నారు.

స్కూల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి



అంజనీపుత్ర రియల్ ఎస్టేట్, నజీర్ సౌండ్ సిస్టం ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో గురువారం సింగరేణి హై స్కూల్ మైదానంలో స్కూల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సింగరేణి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, తహసీల్దార్ సతీష్, మండల విద్యాధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్ హాజరై క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్స్ పెరిక శ్రీకాంత్, సమీర్, చంటి, గుల్షన్, ప్రసాద, అభికాలే, సమీర్ నంది పాల్గొన్నారు.

వరి నాటు క్షేత్రాల పరిశీలన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ధర్మారం గ్రామంలో యాసంగి వరి నాటు క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ స్కీమ్‌లో భాగంగా రైతుకు వరి నాటు వేస్తున్న క్షేత్రాలను గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత, ఏఈఓ త్రిసంధ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు. ఇందులో రైతు దేవల్ల భీమయ్య పాల్గొన్నారు.

సమాజ మార్పుకు పాటుపడాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



సమాజ మార్పుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు భూపెల్లి మల్లేష్ అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అనే స్వచ్ఛంద సంస్థలో పదేండ్ల నుండి సేవ చేసి బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు తీసుకున్న తొగరు రాజును గురువారం పట్టణంలోని గురునానక్ ఫంక్షన్ హాల్లో సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యువత ఆర్థికంగా నిలదొక్కుకున్నపుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. నేటి ఏఐ కాలంలో సమాజ సేవ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. సామజిక సేవ చేసే వారికి తాము అండగా ఉంటామన్నారు. ఇందులో రాష్ట్ర నాయకులు దమ్మ నారాయణ, జిల్లా నాయకులు మాలెం చిన్నన్న, ఏజీపీ వేల్పుల సత్యం, మండల ఉపాధ్యక్షులు భైరం లింగన్న, తోటపల్లి మహేందర్, దేవి బీమయ్య అలుగునూరి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, అడ్లూరి శివకుమార్, పెండెం సత్తయ్య, చాతరాజు రాజశేఖర్ పాల్గొన్నారు.

స్నేహితుడి కూతురి పెళ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

జన్నారం గ్రామానికి చెందిన ఫక్రొద్దీన్ కూతురు వివాహం శుక్రవారం ఉండగా అతని స్నేహితులు అండగా నిలిచారు. 1986-87లో అతనితో పాటు జన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన స్నేహితులు రూ.34 వేల నగదు సాయం చేశారు. గురువారం డబ్బులను ఫక్రొద్దీన్‌కు అందజేశారు. ఇందులో పూర్వ విద్యార్థులు గాజుల లింగన్న గౌడ్, అల్లలం నరేష్, కొండాపురం శ్రీనివాస్, రహీముల్లా, అజహర్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో సీఎండీ సమీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వేసవికాలంలో తీసుకోవాల్సిన ప్రణాళికపై ఆసిఫాబాద్ సర్కిల్ విద్యుత్ అధికారులతో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. లో వోల్టేజ్ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని, వీటిని సద్వినియోగం చేసుకొని అధికారులు ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండి ప్రకృతిపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



విద్యార్థి దశ నుండి ప్రకృతిపై అవగాహన ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ తెలిపారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని వేంపల్లిలో అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వన సందర్శన కార్యక్రమాన్ని ఎఫ్డీఓ సుశాంత్ సుఖదేవ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం పూర్తిగా కలుషితమైందని, పర్యావరణ పరిరక్షణ అనేది విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనికోసం అటవీ ప్రాంతాన్ని పెంచడం మినహా వేరే ప్రత్యామ్నాయం లేదన్నారు. జిల్లాలో అటవీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఇదుంలో రేంజ్ అధికారి శశిధర్ బాబు, బీట్ అధికారి విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

- ట్రాన్స్‌కో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-కౌటాల



132/33 నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ట్రాన్స్ కో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతలపాటి కోయగూడ సమీపంలో 132/33 విద్యుత్ సబ్ స్టేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని గతంలో చెప్పిన ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా ఫిబ్రవరి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని గుత్తేదారులను హెచ్చరించారు. అదే విదంగా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పనుల వివరాలను పరిశిలించాలని ఆదేశించారు. పనులలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నాలుగు మండలాలకు నాణ్యమైన విద్యుత్ అందిచాలన్నారు. పర్యావరణ కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి వాటిని రక్షించే ప్రయత్నం చేయాలన్నారు. ఆయన వెంట డీఈ సంపత్ రెడ్డి, ఎస్సీ వీరేష్, పి.వెంకటేశ్వర్, డీఈలు నాగరాజు, జీవరత్నం, విద్యుత్ అధికారులు ఉన్నారు.

పని ప్రదేశాల్లో పరికరాలు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-జైపూర్



గని కార్మికులకు పరికరాలు పని ప్రదేశాల్లో అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య అన్నారు. గురువారం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదాతో కలిసి గనిలోని వివిధ విభాగాల కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న షెడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, కార్మికులు వినియోగించుకునే విధంగా పార్కింగ్ షెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై గని మేనేజర్‌ను కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మత్యారి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటి చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శి నవీన్ రెడ్డి, అగ్గు శ్రీకాంత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మైనింగ్ స్టాఫ్ బ్రాంచ్ ఉపాధ్యాక్షులు బాలకృష్ణ, నాయకులు దేవేందర్, సత్తయ్య, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ భక్తులకు ఎంతో ఉపయోగకరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బాలేశ్వరాలయ సమీపంలో ఏర్పాటు చేసిన సరస్వతి, నర్మదా పుష్కర ఘాట్ భక్తులకు ఎంతో సౌకర్యం అందంగా ఉంటుందని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు దండనాయకుల శ్రీనివాసరావు స్మారకార్థం ఆయన కుమారుడు నవజ్యోతి స్థాపకుడు సురేష్ కుమార్ ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి అర్చకుడు మధుకర్ ప్రత్యేక పూజలు మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలేశ్వరాలయం ఎంతో పురాతనమైనదని, ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరకు వందలాదిమంది వేరే ప్రాంతాల నుండి తరలి వస్తారన్నారు. వీరికి పుణ్యస్నానాలు ఆచరించడానికి పుష్కర ఘాట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం పుష్కర ఘాట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన సురేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు గుండా వెంకన్న, శ్రీనివాస్, జీవన్, నవజ్యోతి సంస్థ సభ్యులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



జిల్లా కేంద్రంలోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గురవారం అంబేద్కర్ యువజన సంఘం మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రజాయుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బండి సంజయ్ గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ కోరాలని, బీజేపీ ప్రభుత్వం బండి సంజయ్‌ని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, బీఎస్పి జిల్లా అధ్యక్షుడు మురళీధర్, ఈర్రోళ్ల పురుషోత్తం, సాధ విజయ్, ముత్యం, మమాడ మండల అధ్యక్షులు దేవుళ్ల మధు, ఆకుల రమేష్, సతీష్, భూమేష్, సేపురి అడెల్లు, గంగాధర్, రాజేందర్, నవీన్, రాజు, ప్రశాంత్, రవీందర్, గణేష్, ప్రేమ్ కుమార్ సంఘ సభ్యులు ఉన్నారు.

కేస్లాపూర్‌కు సిరికొండ నుంచి బస్సు నడుపాలి

నవతెలంగాణ-సిరికొండ

కేస్లాపూర్ నాగోబా జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్తారని, సిరికొండ నుంచి బస్సు నడుపాలని గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డీఎంను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇమామ్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలో ఎక్కువ గిరిజన ప్రజలు ఉన్నారని, ఆదివాసుల రెండో అతిపెద్ద జాతర నాగోబా అని, జాతరకు పెద్ద ఎత్తున తరలి వెళ్తారని అన్నారు. దీంతో ప్రయాణికులకు కొంత ఇబ్బందిగా ఉందని, బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

అంటరానితనం నిర్మూలనకు కృషి

నవతెలంగాణ-కడెం

అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న అన్నారు. గురువారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అంటరానితనం నిర్మూలన గురించి వివరించారు. ఈ సందర్భంగా బొడ్డు గంగన్న మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అంటరానితనాన్ని నిర్మూలించి, సమసమాజ స్థాపన కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, పోలీస్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆరోపించారు. 420 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు నెరవేర్చలేదని గుర్తుచేసిన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన, కాంగ్రెస్ 420 రోజులైనప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం గొప్పగా సంక్షేమ పథకాలు ప్రవేశం పెడుతున్నామని ఊదరగొడుతూ లబ్ధిదారులను తగ్గించే పని పెట్టుకుందన్నారు. గతంలో తమ ప్రభుత్వంలో ఎటువంటి సాకులు చూపకుండా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకం అమలు చేసినట్లు గుర్తు చేశారు. ఇచ్చిన మాటను నెరవేర్చే గాంధీ ప్రవర్తన కాంగ్రెస్ నాయకులతో వచ్చేలా చూడాలని ఆయనను కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు శ్రీనివాస్, భీమేశ్, నిసార్, జీవన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తిర్యాణీ : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో 420 హామీలను ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి నేటికీ 420 రోజులు గడిచిన ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదంటూ గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచ శ్రీనివాస్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు ముత్యం రాజయ్య, బుర్ర రమేష్ గౌడ్, పోలస రమేష్, దుస్స మధుకర్, పులి చందు, సోషల్ మీడియా కన్వీనర్ దేవేందర్, బొడ్డు రవీందర్, రవి, భీంపటేల్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు ఎమ్మెల్యే కొవ లక్ష్మి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కండ్లు తెరిపించేందుకు వినూత్న కార్యక్రమాన్ని ఆపార్టీ నాయకులు చేపట్టారు. ఇచ్చిన గ్యారంటీలను ప్రకటించిన హామీలను అమలు చేయకుండా విస్మరించిన కాంగ్రెస్ తీరును నిరసిస్తూ గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుద్ధి ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సంజీవ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ మహేష్ గౌడ్, మాజీ సర్పంచ్ అహల్యదేవి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ జరుద్దీన్, టౌన్ అధ్యక్షులు అశోక్, మహిళా నాయకులు శంకరమ్మ, మహిళా అధ్యక్షురాలు అరుణ పాల్గొన్నారు.

కెరమెరి : గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ హామీలను గుప్పించి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మకి ధృపతబాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ ఇనుస్, సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు, నాయకులు సిడాం ధర్మ, గుజ్జుల వెన్నకటేశ్వర్లు, మడావి రఘునాథ్, రాంచందర్ పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

నవతెలంగాణ-కౌటాల



అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడ్డ సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీసీఐలో ట్రాక్టర్ ట్రాలీలో పత్తి లోడ్ చేసుకొని కౌటాల జిన్నింగ్ మిల్లుకు వెళ్తున్నారు. కౌటాల మొగడ్ దగడ్ ప్రధాన రహదారి గ్రోమోర్ సెంటర్ మూలమలపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి అపాయం జరగలేదు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుష్టు వ్యాధిని 100శాతం నివారించేందుకు సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేయాలని జిల్లా వైద్యాధికారి సీతారాం వైద్య సిబ్బందిని ఆదేశించారు. కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో 15 రోజుల పాటు నిర్వహించే సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు సిబ్బంది 100శాతం పని చేయాలన్నారు. ఇంటింటికి సర్వే కోసం వెళ్లినప్పుడు చర్మంపై మచ్చలు ఆధారంగా చేసుకుని వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలున్నప్పుడు వెంటనే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆ వ్యక్తులను తీసుకువెళ్లి పరీక్ష చేయించాలన్నారు. కుష్టు వ్యాధికి సంబంధించిన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కుష్టు వ్యాధికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు మందులు అందేలా చూడాలన్నారు. వారికి మానసికంగా ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లెప్రసీ ప్రోగ్రాం అధికారి అజీముద్దీన్, మెడికల్ అధికారులు వినోద్ కుమార్, వెంకటేష్, జిల్లా ప్రోగ్రాం సహాయ అధికారి శ్యామ్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మహాత్మ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని, ఆయన చూపిన అహింసమార్గం ఆదర్శప్రాయమని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస మార్గంలో దేశానికి స్వాతంత్రం సాధించిన మహాత్ముడు అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఆయన మార్గంలో ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ మధుకర్, జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మహాత్మా గాంధీ వర్ధంతిలో ఏఎస్పీ ప్రభాకర్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, డీపీఓ, ఐటీ కోర్, డీసీఆర్బీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంబేద్కర్ సృజల స్రవంతి, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుటి. శ్రీనివాస్ అన్నారు. గురువారం రిటైర్డ్ ఎంప్లాయ్ కార్యాలయ ఆవరణలో వామపక్ష ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణహిత తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2008లో శంకుస్థాపన జరిగిందని, దానికి బి.ఆర్. అంబేద్కర్ ప్రాజెక్టుగా నామకరణం చేశారన్నారు. ప్రాణహిత నుండి ఎల్లంపల్లి వరకు 116 కిమీ నాటి కాంగ్రెస్ కాలువ నిర్మాణానికి రూ.1700 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రూ.38 వేల కోట్లు అయ్యే మొత్తం ప్రాజెక్టుకు, ఆనాడే రూ.9 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్నీ తానై, కుట్రతో నీరు లేదనే కుంటి సాకుతో (కాళేశ్వరం)మేడిగడ్డకు మార్చి అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు నిర్మించారని తెలిపారు. బడ్జెట్‌ను కూడా పెంచారన్నారు. ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన ప్రాణహిత ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని, కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించడం అసాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు గుళ్ళపల్లి ఆనంద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండీ చాంద్ పాషా, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు జైపాల్ సింగ్, ఏఐకేఎంఎస్ జిల్లా కన్వీనర్ రత్నం పోషన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బండారి తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు లెనిన్, ఏఐకేఎంఎస్ నాయకులు భీంరావ్, మారు చంద్రన్న పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను వేగవంతం చేసి ఫిబ్రవరి 10వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకంలో జిల్లాలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు పూర్తి సదుపాయాల నడుమ నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలలో చేపట్టిన 4 కాంపోనెంట్ పనులు ఫిబ్రవరి 10వ తేదీలోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన ప్రతి పాఠశాలలో తాగునీరు, మూత్రశాలల నిర్మాణం, విద్యుదీకరణ, గదుల మరమ్మత్తు పనులను వంద శాతం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. పనులలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పూర్తి అయిన పనుల మేరకు మాత్రమే ఎంబిలో రికార్డులు పూర్తి చేసి బిల్లుల కొరకు అందజేయాలని తెలిపారు. ప్రతి పనికి ఫొటో, క్వాలిటీ కంట్రోల్ రిపోర్టు, మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారి సంతకం చేసిన ధ్రువపత్రాన్ని జతపరిచి జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు.

మండల కేంద్రాల్లో కమ్యూనిటీ కాంప్లెక్స్‌లు నిర్మించాలి

ప్రతి మండల కేంద్రంలో మార్కెట్ ప్రాంతాలు, బస్సు స్టాపులు, జన సమూహం అధికంగా ఉండే ప్రాంతాలలో అనువైన స్థలాలను ఎంపిక చేసి కమ్యూనిటీ సానిటేషన్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని ఎంపీడీఓలకు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం మార్కెట్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మూత్రశాలలు ఉపయోగపడతాయని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. వచ్చే వేసవికాలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రజలందరికీ సరఫరా చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. తాగునీటికి ఇబ్బంది ఉన్న గ్రామాలు, నివాస ప్రాంతాలను గుర్తించి నివేదిక అందించాలని, నూతన బోరు బావులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని, తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో ప్రతి ఇంటిని సందర్శించి నీటి వనరులను గుర్తించి పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం కింద వేసవికాలంలో ప్రతి గ్రామానికి తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, పంచాయతీ ఇంజనీరింగ్ ఈఈ ప్రభాకర్, విద్యా శాఖ, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అవుతున్న గూడెంగుట్ట

నవతెలంగాణ-దండేపల్లి



తెలుగు రాష్ట్రాల్లో రెండో అన్నవరంగా పేరుగాంచిన మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతుంది. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలకు వేలాది సంఖ్యలు భక్తులు వచ్చి సామూహిక వ్రతాలు ఆచరిస్తారు. ఫిబ్రవరి 6 నుండి 13 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ సిబ్బంది తెలియజేశారు. ఫిబ్రవరి 9న స్వామివారి కళ్యాణానికి వేల సంఖ్యల జనాలు హాజరవుతారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భక్తుల సౌకర్యాగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. దీంతో గూడెం గుట్టకు పండుగ శోభ సంతరించుకుంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎంవీఐ మోహన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డిటిఓ కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఏఎంవీఐ రాజమల్లుతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజులపాటు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ అరుణబాయి, సిబ్బంది వినీల్, కానిస్టేబుల్ వాజిద్, రవి పాల్గొన్నారు.

పదండి నాగోబా జాతర

- నేడే దర్బార్
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు
- కొనసాగుతున్న సాంప్రదాయ పూజలు
- దర్బార్‌కు హాజరుకానున్న మంత్రులు సీతక్క కొండా సురేఖ, కిన్వట్ ఎమ్మెల్యే కేరామ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నాగోబా జాతర ప్రారంభమై మూడో రోజు కొనసాగుతోంది. శుక్రవారం కేస్లాపూర్‌లో ప్రజాదర్బార్ ఉండటంతో ఐటీడీఏ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. గోవాడ్ వద్దకు వెళ్లి మెస్రం భేటింగ్ కోడళ్ల గురించి మెస్రం వంశీయులు పీఠాధిపతి వెంకట్‌రావ్, ప్రధాన్ దాదేరావ్, కొత్వాల్ తిరుపతి వారి ఆచార సాంప్రదాయ పద్ధతిని వారికి వివరించారు.

గోవాడ్‌లో భేటింగ్ కోడళ్లకు సాంప్రదాయ కథలు..

భేటింగ్‌లో పాల్గొన్న 54 జంటలు కోడళ్లకు ప్రధాన్‌జి దాదేరావ్ ఆధ్వర్యంలో కిక్కిరి వాయిస్తూ.. సంస్కృతి సాంప్రదాయాలను కథల రూపంలో వివరించారు. అనంతరం వారి వాయిద్యాలైన కాలికొమ్, పెప్రే, తుడుం వాయిస్తూ.. గోవాడ నుంచి దేవాలయం వెనుక ఉన్న భాన్ దేవత వద్దకు బాజా భజంత్రీలు మధ్య సాగనంపారు. వీరు తెల్లటి వస్త్రాన్ని ముసుగు వరకు ధరించి నెత్తిపై కుండలు పెట్టి, కలశంలో కోనేరు నుంచి నీటిని తెచ్చారు. ఈ నీటితో మెస్రం వంశీయులు భాన్ దేవత ప్రతిమను చేశారు. అక్కడే ఉన్న భాన్ దేవతకు సాంస్కృతిక పూజలు చేశారు. ఈ పూజలో మహిళల పాత్ర అధికం.

పెర్సాపేన్ పూజలు..

నాగోబా ఆలయం వెనుక గల పెర్సాపేన్‌కు మెస్రం వంశీయులు వారి ఆచార సాంప్రదాయ ప్రకారం 22 కితాల నుంచి దంపుడు బియ్యం, పెసర పప్పు, బెల్లం, టెంకాయలను సమర్పించారు. వీటితో వారి వాయిద్యాలు వాయిస్తూ.. తమలపాకును సమర్పించారు. మెస్రం పెద్దలకు పాదాభివందనం చేశారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించి, పెర్సాపేన్ పూజలు చేశారు. ఈ పూజకు మెస్రం పురుషులు మాత్రమే చేయడం వారి ఆచారం.

నాగోబా సన్నిధిలో కోడే ప్రదానం..

నార్నూర్ మండలం గుంజాలకు చెందిన మెస్రం భీంరావ్ అనే భక్తుడు ఆవు కోడేను నాగోబా సన్నిధిలో ప్రదానం చేసి తమ మొక్కును చెల్లించుకున్నారు. తమ కోరికలు నాగోబా తీర్చినందుకు కోడెను దానం చేశానన్నారు.

కూటి కోసం.. కోటి విద్యలు..

కూటి కోసం కోటి విద్యలు అన్నట్టుగా నాగోబా జాతరలో విభిన్న రీతిలో వేషాలు వేసి తమ కడుపును నింపుకుంటున్నారు. ఓ వ్యక్తి అచ్చం గాంధీ వేషధారణతో ప్రజలను ఆకర్షిస్తున్నాడు. అక్కడి నుంచి వెళ్తున్న ప్రతి ఒక్కరూ ఆయనను ఆసక్తిగా చూస్తున్నారు. తమకు తోచిన విధంగా దానం చేశారు.

కుష్టును ముందస్తుగా గుర్తిస్తే చికిత్స సులువు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుష్టు వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే చికిత్సలకు సులువుగా ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన అన్నారు. జాతీయ కుష్టు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఖుర్షీద్ నగర్ అర్బన్ పీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. గాంధీ వర్ధంతిని సందర్భంగా గాంధీ చిత్రపటం, కుష్టువ్యాధి కారక క్రిమిని గుర్తించిన శాస్త్రవేత్త డాక్టర్ హాన్సన్ చిత్రపటానికి పులమాలలు వేసి జ్యోతి ప్రజ్వల చేశారు. అనంతరం కుష్టు గుర్తింపు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన మాట్లాడుతూ కుష్టు రహిత సమాజం కోసం ఆశా, ఏఎన్‌ఎంలు కృషి చేయాలన్నారు. సర్వే కోసం ఇంటింటికి వెళ్తున్న క్రమంలో ఒక దాని కోసం కాకుండా అన్ని వ్యాధుల గురించి తెలుసుకోవాలని సూచించారు. గతంలో కేసులు పెరిగిన నేపథ్యంలో ముందస్తుగా కుష్టు గుర్తింపుకు కృషి చేసి త్వరగా నయం చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల 18వ తేది వరకు స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం కాకుండా ఉంటుందని ప్రజలకు తెలియజేయాలని, వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ అధికారి సుమలత, ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రొగామ్ అధికారి గజానంద్, డీఐఓ వైసీ శ్రీనివాస్, వైద్యాధికారి అన్సారీ, డీపీఎంఓలు వామన్‌రావు, రమేష్, ఎల్.నిజామొద్దీన్, సీఓ ప్రశాంత్ దేశపాండే, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గడిచిన 11 ఏండ్లలో విద్యతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. గురువారం బీజేపీ ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మలక కొమురయ్యతో కలిసి ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మార్నింగ్ వాక్ చేశారు. వాకింగ్‌లో ఉపాధ్యాయులను కలుస్తూ తొలి ప్రాధాన్యత ఓటు బీజేపీ అభ్యర్థికి వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో ఉన్న ప్రభుత్వాలతో పాటు ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రబుత్వం విద్య రంగంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. నీతి, విలువలతో కూడిన వ్యక్తి కొమురయ్య అని తెలిపారు. శాసనసభ మండలిలో వీరి సమస్యలపై గళం విప్పడానికి బీజేపీ బలపరిచిన అభ్యర్థి కొమురయ్యను గెలిపించాలన్నారు. గడిచిన కాలంలో ఇప్పటి వరకు



ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య అన్నారు. ఒక్కో కెటగిరిలో ఒక్కో సమస్య ఉందన్నారు. గెలిచిన ఎమ్మెల్సీలు ప్రభుత్వంతో కుమ్మక్కై వాటి గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. తనకు అవకాశం ఇస్తే ఉపాధ్యాయులతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కరం కోసం కృషి చేస్తానని తెలిపారు. వారి వెంట బీజేపీ నాయకులు రత్నాకర్‌రెడ్డి. జీవన్, బోయర్ విజయ్ ఉన్నారు.

రేపు భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో రేపు భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శివ భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకుని ఉదయం 6:00 గంటల నుండి ధ్వజాదోరనం, హోమం, పూర్ణహుతి 9గంటలకు పల్లకి సేవ శోభాయాత్ర, 2 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సేవాలాల్ జయంతి 15న సెలవు దినంగా ప్రకటించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని మహేందర్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బంజారా జాతికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని అన్నారు. అదేవిధంగా సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ పాండు నాయక్, మండల ఇన్‌చార్జీ సందీప్ నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, లంబాడ నాయకులు ఉన్నారు.

అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి, ప్రయివేట్ కార్పొరేట్ ఆస్పత్రుల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని గురువారం ప్రగతిశీల ప్రజాస్వామ్య మహిళా సంఘం ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా సంఘాల ఆధ్వర్యంలో సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్య రక్షణ అనేది ప్రభుత్వాల నైతిక బాధ్యతని అన్నారు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో దీనికి విరుద్ధంగా ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల సంక్షేమమే ప్రభుత్వ సంక్షేమం అన్నట్లు ఉందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం పూర్తయినా కూడా ఇంకా జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు లక్ష్మి, విజయ, గంగామణి, కవిత, కమల, టీయూసీఐ జిల్లా అధ్యక్షులు బక్కన్న, నాయకులు గంగన్న, సాయన్న, నాయకులు పాల్గొన్నారు.

దేశానికి ఉపయోగపడేలా ప్రయోగాలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం ఆలోచలను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు కూడా దేశానికి ఉపయోగపడేలా ప్రయోగాలు చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో డిఫెన్స్ అండ్ స్పెస్ ఎక్స్‌ఫోను లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅథితిగా హాజరై ఎక్స్‌పో ప్రారంభించారు. డిఫెన్స్‌లో వినియోగించే రాకెట్లు, స్పెస్‌లో ప్రయోగించిన శాటిలైట్ ఇతర వాటిని ప్రదర్శనలో ఉంచారు. వాటి గురించి కలాం ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వివరించారు. అంతకు ముందు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు నరేష్, పాఠశాల ప్రిన్సిపల్ దేవేందర్ పటస్కర్, ట్రాస్మ జిల్లా అధ్యక్షుడు రంగినేని పవన్‌రావు, సభ్యులు పురుషోత్తంరెడ్డి, వేదవ్యాస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీకి ఆహ్వానం

కడెం : మండలంలోని లింగాపూర్ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన దేవాలయంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేష్‌ను ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమం ఫిబ్రవరి 17న ఉంటుందని అన్నారు. వారి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే, ఎంపీ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. అలాగే ఎంపీ నిధుల నుంచి దేవాలయ ప్రహరీ గోడకు రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఇటీవల లింగాపూర్‌కు చెందిన ఐదుగురు విజిట్ వీసా ద్వారా వెళ్లగా వీసా కాలపరిమితి ముగియడంతో ఆ దేశ పోలీసులు వారిని జైల్లో వేయగా వారిని జైల్లో నుంచి విడుదల చేయించాల్సిందిగా ఎంపీని కోరారు. కార్యక్రమంలో లింగాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, రాజశేఖర్, శంకర్, భాస్కర్, శ్రీనివాస్, గంగాధర్, రాజన్న ఉన్నారు.

కందుల కొనుగోలు ప్రారంభం

నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గురువారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవి కందుల కొనుగోలును లాంఛనంగా అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ మార్కెట్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ జైనథ్ ద్వారా కందుల కొనుగోలును రూ. 7,550 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేపట్టిందని, దీనిని ప్రతి ఒక్క రైతు సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. బయట దళారులకు తమ పంటను అమ్మి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం.ప్రవీణ్‌రెడ్డి, సీఓ గంగన్న, ఏఓ, పీఏసీఎస్ సిబ్బంది ప్రశాంత్, సింగిడి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సుర్జాపూర్‌లోని పేద కుటుంబానికి చెందిన వడ్డేటి మౌనిక వివాహానికి ఓకేఆర్ ఫౌండర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో పుస్తె మట్టెలు అందజేశారు. తల్లిదండ్రులు లేకపోవటంతో సాయం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను బంధుమిత్రులందరూ ప్రశంసించారు. కార్యక్రమంలో పంబాల భీమన్న, దూడం శ్రీనివాస్, పాలిక్ శ్రీనివాస్, సంగర్తి రాజన్న, బొమ్మెన రాకేష్, జంగ ఎర్రన్న, మడిగేలా అనిల్ పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని ఎంపీడీఓకు వినతి

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో జాతీయ ఉపాధి హామీ ఉద్యోగులు వేతనాలు ఇప్పించాలని గురువారం ఎంపీడీఓ లక్ష్మీకాంతరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన పథకాలను విజయవంతం చేసేందుకు పండుగలు సెలవులు అనే తేడా లేకుండా రాత్రి పగలు పని చేశామన్నారు. తమ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం సకాలంలో వేతనాలు లేక పస్తులున్నామన్నారు. మూడు నెలలుగా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వేతనాలు ఇప్పించాలని కోరారు.

యోగా విభాగంలో గోల్డ్ మెడల్

నవతెలంగాణ-జైనథ్

తెలంగాణ రాష్ట్ర 3వ పోలీసు క్రీడలు కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ క్రీడల్లో మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళ కానిస్టేబుల్ ఆర్.రూప యోగా విభాగంలో రాష్ట్రంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పోలీస్ విభాగం హర్షం వ్యక్తం చేశారు. గోల్డ్ మెడల్ సాధించిన మహిళ కానిస్టేబుల్ రూపను జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె తనకు అవకాశం కల్పించిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఖానాపూర్ తహసీల్దార్‌గా సుజాత బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ తహసీల్దార్‌గా సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కడెం తహసీల్దారుగా సుజాత విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శివరాజ్ నిర్మల్ కలెక్టర్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు.

10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు ప్రారంభమైనట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్ గురువారం విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. వార్షిక పరీక్షలకు ప్రిపేర్ అవుతన్న విద్యార్థులు అనుసరించాల్సిన పద్దతులు వివరించి మంచి మార్కులు సాధించడం కోసం కృషి చేయాల్సిన విధానం వివరించారు. ప్రేరణ తరగతులు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగోతు శ్యాంసుందర్ అన్నారు. ఈ సందర్భంగా మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్‌ను శాలువాతో సన్మానించారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారం, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడారు. పాలకవర్గానికి వంత పాడకుండా పార్టీ అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో ప్రస్తవిస్తారన్నారు. గతంలో పట్టభద్రులను కేవలం ఓటు బ్యాంకులనే చూసే వారన్నారు. కానీ బీజేపీ ఈ సారి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడానికి అభ్యర్థులను ప్రకటించిందని అన్నారు.